క్లుప్తంగా

కేసులను సత్వరం పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు సంబంధిత కేసులను సత్వరం పరిష్కరించాలని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ఆమె మంగళవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించేందుకు నియమించిన న్యాయవాదులతో ఆయా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి ఎలాంటి సమస్యలున్నా తెలియజేయాలన్నారు.

మజ్దూర్ యూనియన్ విజయకేతనం



విజయం సాధించిన ధర్మాల శ్రీనివాసరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సౌత్ సెంట్రల్ రైల్వే కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో రైల్వే మజ్దూర్ యూనియన్ సభ్యులు విజయకేతనం ఎగురవేశారు. విజయవాడ డివిజన్ స్థాయిలో జరిగిన సొసైటీ ఎన్నికల్లో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ పరిధిలో పోటీ చేసిన నలుగురు మజ్దూర్ సభ్యులు విజయఢంకా మోగించారు. సొసైటీలో 29 మంది సభ్యులకుగాను మజ్దూర్ యూనియన్‌కు చెందిన 28 మంది ఘన విజయం సాధించారు. దీంతో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఘోర పరాజయం పాలైంది. రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నుంచి ధర్మాల శ్రీనివాసరెడ్డి, కె. కృష్ణనాయక్, డి.బాలకృష్ణ, పి.సీతారామ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సొసైటీ సభ్యుల సంక్షేమానికి, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పారదర్శకంగా స్టాఫ్ నర్స్ ఎంపికలు

ప్రకాశం నగర్: స్టాఫ్ నర్స్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఎం పి.పద్మ శశిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెయిటేజీ మార్కుల కోసం సమర్పించే సర్వీస్ సర్టిఫికెట్లకు సంబంధించి తప్పనిసరిగా సంబంధిత నియామక అధికారి ధ్రువీకరణ పత్రాలనే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. పనిచేసిన కాలానికి సంబంధించిన జీతభత్యాల వివరాలతో ఉన్న బ్యాంక్‌ఖాతా స్టేట్‌మెంట్, ఒరిజనల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ సమయంలో సమర్పించాలన్నారు. నకిలీ సర్టిఫికెట్లు, ధ్రువీకరణ పత్రాలను అందజేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళారులను నమ్మి మోసపోవద్దని, మెరిట్ ఆధారంగానే నియామకాలు జరుగుతాయన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే రాజమహేంద్రవరం ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు జోన్-2కు తెలియజేయాలన్నారు.

క్వారీ ఏరియాలో కార్డన్ సెర్చ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఎస్పీ జగదీష్, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్, వన్‌టౌన్, త్రీటౌన్, ప్రకాష్ నగర్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్ పార్టీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కలసి మంగళవారం క్వారీ మార్కెట్ పరిసర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గాదిరెడ్డి నగర్‌కు చెందిన వరదా శివశంకర్, సీతంపేటకు చెందిన కాకర వీరభద్రరావును అరెస్టు చేసి, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. గాదిరెడ్డి నగర్‌కు చెందిన కడిమి కృష్ణను అరెస్టు చేసి ఒడిశాకు చెందిన 750 ఎంఎల్ రెండు మద్యం సీసాలు పట్టుకున్నారు.

4,645 మందికి వైద్యసేవలు

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 23వ రోజు మంగళవారం జిల్లావ్యాప్తంగా తొమ్మిది వైద్యశిబిరాలు నిర్వహించినట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మౌనిక తెలిపారు. వీటిలో 4,645 మంది రోగులు వైద్యసేవలు పొందగా, 44 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ఆసుపత్రిలకు రిఫర్ చేశామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కోటిలింగాలపేట ఇసుకర్యాంపులో లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కొవ్వూరు మండలం మద్దూరు గ్రామానికి చెందిన అంబటి సుబ్బారావు కోటిలింగాలపేట ఇసుకర్యాంపులో పడవల వద్ద గుమాస్తాగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఇసుక లారీ వెనుకకు డ్రైవర్ పోనిస్తుండగా అక్కడ ఉన్న సుబ్బారావును ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. త్రీటౌన్ ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం

- పారదర్శకంగా పథకాలు
- వై ఏపీ నీడ్స్ జగన్ సమావేశంలో ఎంపీ భరత్‌రామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. మళ్లీ ఆయన సీఎం అయితేనే అందరికీ మేలు జరుగుతుందన్నారు. తాడితోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో నాలుగో క్లస్టర్ అధ్యక్షుడు పెంకే సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ (జగనన్నే ఎందుకు కావాలంటే) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ దేశంలోనే అద్భుతమైన పాలన ఏపీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. సీఎం జగనన్న ఆలోచనల నుంచి అనేక సంచలన సంక్షేమ పథకాలు, వ్యవస్థలు జీవం పోసుకున్నాయన్నారు. వాటి వల్లనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వం సేవలు వచ్చి చేరుతున్నాయన్నారు. చక్కని ప్రణాళికతో అన్ని వర్గాలకూ పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయంటే సీఎం జగనన్న ఆలోచనా విధానమే కారణమన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ ఫలాల పంపిణీ జరుగుతోందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగన్‌ను ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలన్నారు. సమావేశంలో సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జులు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ప్రజల ఇంటి వద్దకే సంక్షేమం



రూరల్ కార్యాలయంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, వాటిని ప్రజల ఇంటి వద్దకే అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, నగరపాలక సంస్థ పరిధిలోని క్లస్టర్ ఇన్‌చార్జి మింది నాగేంద్ర అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ఆదేశాల మేరకు రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మింది నాగేంద్ర, డివిజన్లు, రూరల్, కడియం జేసీఎస్ కన్వీనర్లు రాజమౌళి, తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కులమతాలు, పార్టీలకు అతీతంగా నవరత్నాల పథకాలను ప్రతి ఇంటికి అందించారన్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీశ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షకీలా బేగం, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్ పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ శ్రీనివాసరావుకు విశిష్ట బహుమతి



విశిష్ట బహుమతి అందుకుంటున్న గుత్తుల శ్రీనివాసరావు

కడియం: విశాలాక్షి మాసపత్రిక వార్షికోత్సవం సందర్భంగా మామిడిపూడి రామకృష్ణయ్య స్మారకంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో వేమగిరి గ్రామానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ గుత్తుల శ్రీనివాసరావు విశిష్ట బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు నెల్లూరులో ఆదివారం బహుమతి ప్రదానం జరిగింది. రాజకీయ నాయకులపై వివిధ సందర్భాల్లో అభిమానం చాటుకొనేవారు మరీ శృతి మించితే ఎలా ఉంటుంది అనే విషయాన్ని శ్రీనివాసరావు కార్టూన్ ద్వారా హాస్యాన్ని జోడించి చూపించారు. విభిన్నమైన ఈ కార్టూన్ పలువుర్ని ఆకట్టుకోవడమే కాకుండా అనేక మంది ప్రశంసలు అందుకుంటోంది. సామాజిక సమస్యలపై స్పందిస్తూ తరచూ కార్టూన్లు గీసి అనేక రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు గెలుచుకున్న శ్రీనివాసరావు వృత్తి రీత్యా చదరంగ శిక్షకుడిగా పని చేస్తున్నారు.

మేజర్ డ్రైనేజీల ఆధునీకరణకు శ్రీకారం

- అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు
- ఎంపీ భరత్ రామ్



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో అస్తవ్యస్తంగా ఉన్న మేజర్ డ్రైనేజీల ఆధునీకరణ పనులు చేపడుతున్నామని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. మంగళవారం నగరంలోని 38వ డివిజన్‌లో ప్రధాన కాలువల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కరువైపోయాయన్నారు. కనీసం మురుగునీటి వ్యవస్థ మెరుగుకు కూడా ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడం దారుణమన్నారు. తాము గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అన్ని డివిజన్లలో పర్యటించినప్పుడు స్వయంగా చూసిన సమస్యలతో పాటు ప్రజల విజ్ఞప్తులను దృష్టిలో పెట్టుకొని ప్రతి డివిజన్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 38వ డివిజన్‌లో నాలుగు మేజర్ డ్రైనేజీలను రూ.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వీరభద్రపురం హనుమాన్ టెంపుల్ వద్ద గల ఆర్సీసీ స్ట్రాం వాటర్ డ్రైనేజీని రూ.1.99 కోట్లతో, పంతం సత్యనారాయణ స్కూల్ నుంచి మూలగొయ్యి సెంటర్, పరగాటి ఫర్నీచర్ షోరూమ్ వరకూ బీటీ రోడ్డు, సీసీ రోడ్డు పనులను రూ.81 లక్షలతో, మరో రెండు డ్రైనేజీలను రూ.20 లక్షలతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ పనులన్నీ యుద్ధప్రాతిపదికన, నాణ్యతతో పూర్తి చేయాలని ఆర్ఎంసీ ఈఈ పాండురంగారావుకు ఎంపీ భరత్ ఆదేశించారు. ప్రస్తుతం కంబాల చెరువులోకి మురుగు నీరు చేరకుండా డైవర్షన్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, 38, 39, 40 డివిజన్ ఇన్‌చార్జులు అరిగెల బాబు, లంకా ప్రసాద్, దుంగా మంగ, పీతా రామకృష్ణ, టీకే విశ్వేశ్వరరెడ్డి, కట్టా వెంకటేష్ పాల్గొన్నారు.

రామయ్య పాదుకలకు ప్రత్యేక పూజలు



శ్రీరామ పాదకులను శిరసున ధరించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు



శ్రీరామ పాదుకలు

సీటీఆర్ఐ: రామయ్య పాదకులను శిరసున ధరించడం తన పూర్వజన్మ అదృష్టమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. అయోధ్య సీతారామచంద్ర స్వామి వారి పాదుకలను మంగళవారం స్థానిక ప్రకాశం నగర్‌లోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్వగృహానికి తీసుకువచ్చారు. ఆ పాదుకలకు తోట సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దంపతులు, జక్కంపూడి విజయలక్ష్మి విశేష పూజలు చేశారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ రామాయణం మన సామాజిక జీవితానికి ప్రతిబింబం లాంటిదని, ప్రతి ఒక్కరూ తప్పకుండా చదవాలన్నారు. అయోధ్య భాగ్య నగర సీతారామ సేవాఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో దేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలన్నింటిలో స్వామి వారి పాదుకలకు పూజలు చేశామన్నారు. ఈ పాదుకలను భద్రాచలం మీదుగా రాముడు అరణ్య వాసానికి కదిలిన మార్గంలో పాదయాత్రగా సాగి జనవరి 15వ తేదీన అయోధ్య ఆలయంలో సమర్పిస్తారన్నారు. అనంతరం రాజమహేంద్రవరం గౌతమీ ఘాట్ సమీపంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శ్రీరామ పాదుకలకు తోట సుబ్బారావు సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలి



జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ఓఎన్‌జీసీ ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పాలని, సమాజ సమాన అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఎసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. విజిలెన్స్ అవేర్ నెస్ వీక్ 2023లో భాగంగా స్థానిక ఏవీఏ రోడ్డు నుంచి ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ వరకూ మంగళవారం వాకథాన్ నిర్వహించారు. ఓఎన్‌జీసీ ఉద్యోగులు, కలెక్టివ్‌లు, ఎస్‌పీఎఫ్ సిబ్బందితో కూడిన దాదాపు 100 మంది పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని అమిత్ నారాయణ్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అవినీతి ముప్పుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, సత్యం వెల్లివిరిసే వాతావరణాన్ని పెంపొందించేందుకు ఈ వాకథాన్ ఒక అడుగు అన్నారు. ఈ సంవత్సరం సే నో టు కరప్షన్: కమిట్ టు ది నేషన్ అనే థీమ్‌తో అవినీతికి సంబంధించిన సమస్యలు, దానిని తగిన స్థాయిలో నివేదించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనేక కార్యక్రమాలను ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ తన కార్యాచరణ ప్రాంతాల చుట్టూ, లోపల ప్రారంభించిందన్నారు. లంచ నిరోధక నిర్వహణ వ్యవస్థ కోసం ధృవీకరణ పొందిన దేశంలో మొట్టమొదటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ చరిత్ర సృష్టించిందన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..



ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం 10వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆరే చిన్ని ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పలు ప్రాంతాల్లో స్థానికుల సమస్యలు తెలుసుకున్న డాక్టర్ శ్రీనివాస్.. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలంటూ నగర పాలక సంస్థ అధికారులకు సూచించారు. రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, స్థానిక నాయకులు దుర్గాప్రసాద్, చైతన్య, పెదబాబు, రాజేష్ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వల్లభాయ్ పటేల్



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు



కడియంలో పటేల్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ తదితరులు



కడియంలో విద్యార్థుల ర్యాలీ

ప్రకాశం నగర్: సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆదర్శప్రాయుడు అని వక్తలు కొనియాడారు. ఆయన జయంతిని మంగళవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఎస్‌కెవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పటేల్ చిత్రపటానికి హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

- కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి అధ్యక్షత వహించారు.
- ప్రభుత్వ అటానమస్ కళాశాలలో రాష్ట్రీయ ఏక్తా దీవస్ ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామచంద్రరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు. లెఫ్టినెంట్ ఈసుబ్ బాషా పాల్గొన్నారు.

కడియం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (జాతీయ సమైక్యతా దినోత్సవం)ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ప్రజా ప్రతినిధులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రత్నకుమారి, కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

- కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు షేక్ రఫీయుద్దీన్ ఈ ర్యాలీని ప్రారంభించారు.

రన్ ఫర్ యూనిటీ

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా జాంపేట పాత ఏఆర్ ఆఫీసు నుంచి పుష్కరఘాట్ వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. దీనిని ముందుగా ఎస్పీ పి.జగదీష్ జెండా ఊపి ప్రారంభించారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు, అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ ఎస్ఈబీ పి.సోమశేఖరరావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లే

- ఎస్పీ జగదీష్
- రక్తదాతలకు అభినందన



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పోలీసు అమరవీరుల స్మారకోత్సవాన్ని పురస్కరించుకుని జాంపేటలోని పోలీస్ కన్వెన్షన్ హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలామంది స్వచ్ఛందంగా రక్తదానం చేయటానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ పోలీస్ శాఖ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆధ్వర్యంలో సంజీవిని బ్లడ్‌బ్యాంక్, డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహనరావు బ్లడ్‌బ్యాంక్, మాగ్నా చైల్డ్ హాస్పిటల్, ధన్వంతరి బ్లడ్ బ్యాంక్‌లు ఈ శిబిరం నిర్వహించాయి. పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆర్మ్స్, రైట్, వీటి కాలేజీల విద్యార్థులు రక్తదానం చేశారు. వారందరికీ ఎస్పీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం తలసేమియా బాధితులతో ఎస్పీ మాట్లాడారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)ఎస్.ఆర్ రాజశేఖర్ రాజు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





రాజమహేంద్రవరం పుష్కరాలరేవులో మహిళలు



అట్లతద్దె సందడి

సీటీఆర్ఐ: అట్లతద్దె పర్వదినాన్ని మంగళవారం జిల్లా వ్యాప్తంగా మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయమే ఉపవాస దీక్ష చేపట్టి సాయంత్రం అమ్మవారి పూజ నిర్వహించారు. అనంతరం కాలువలు, గోదావరి రేవుల్లో గౌరమ్మకు పూజలు చేశారు. రాజమహేంద్రవరంలోని పుష్కరాలరేవుకు పెద్దసంఖ్యలో మహిళలు తరలివచ్చారు.

శిబిరంలో 522 మందికి వైద్యసేవలు



హుకుంపేటలో సేవలందిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట సచివాలయం-4 సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 522 మంది వైద్యసేవలు అందించగా, 10 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. శిబిరాన్ని మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎంఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ సచివాలయ కన్వీనర్లతో కలిసి ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యులు గుంటూరి తేజ్ కిరణ్, బొబ్బా అనూష, సురేష్ బాబు, పీహెచ్‌సీ వైద్యులు జి.రోహిత, ఈ.నాగదేవి వైద్యపరీక్షలు నిర్వహించారు. రోగుల నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో ఫీడ్‌బ్యాక్ సేకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుంటూరు వెంకటరావు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తాటికొండ విష్ణుమూర్తి, సచివాలయ కన్వీనర్లు మీరావలీ, నాగు, రాంబాబు, పసలపూడి శ్రీనివాసరావు, విశ్రాంత విద్యుత్ ఉద్యోగి బండి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

574 మందికి వైద్యసేవలు

కడియం: వేమగిరి -1 గ్రామసచివాలయంలో నిర్వహించిన వైద్యశిబిరంలో 574 మందికి వైద్యసేవలందించగా, 14 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. స్పెషలిస్టు వైద్యులు ఎంవీఎస్ సుధాకర్, సాయిపుష్పవాణి, పీహెచ్‌సీ వైద్యులు నాగసాయిమౌర్య, స్వరూప, జెస్సీ ప్రియాంక వైద్య సేవలు అందించారు. వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డక్టార్ అనసూరి పద్మలత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల చక్రవర్తి, సచివాలయ కన్వీనర్లు వైద్యశిబిరాన్ని సందర్శించారు.